క్లుప్తంగా

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించండి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : చదువుకునే విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. స్థానిక అశోక్ నగర్‌లోని ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత పెట్టి మంచి ఫలితాలు రాబట్టడం ద్వారా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాలపై అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు.

వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన దళితసేన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 29న తాడేపల్లిగూడెంలో నిర్వహించే దళితసేన నాలుగో ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని దళితసేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈమేరకు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం స్థానిక గన్‌బజారులో ఆయన మహిళా నాయకులతో కలిసి విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, వారి హక్కులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాల సాధనకు దళిత సేన పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, వర్కింగ్ ప్రెసిడెంట్ లావేటి ప్రవల్లిక, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా సౌభాగ్యలక్ష్మి దర్శనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆషాడమాసం మూడో శుక్రవారం సందర్భంగా స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరణ చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెగా చీరలు, రవికల ముక్కలు, పసుపు, కుంకుమలు, గాజులు, పండ్లు, చలిమిడి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వాటర్ ఫౌంటెన్ పనులపై ఏదీ శ్రద్ధ

ఏలూరు నగర ప్రజల సందేహాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వాయు కాలుష్యం నానాటికీ పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. దేశంలో వాయు కాలుష్యం ఉన్న నగరాల్లో ఏలూరు ఉండడం గమనార్హం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ గ్రీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా నగరంలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించేలా కాలుష్య నివారణకు చర్యలు చేపట్టారు. కొత్త ప్రభుత్వంలో ఈ పనులన్నీ నిలిచిపోవటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో ప్రమాదకరమైన సల్ఫర్, కార్బన్‌డయాక్సైడ్ వ్యాప్తి చెందుతూ ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తాయనే నేషనల్ గ్రీన్ ఎయిర్ నిపుణుల సూచనలతో ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వాటర్ ఫౌంటెన్ల నిర్మాణం చేపట్టారు. వాటర్ ఫౌంటెన్ల కారణంగా నీరు ఎగిసి పడుతూ ఉంటే గాలిలోని ప్రమాదకర రసాయన కణాలు ఆకర్షితమై వాటిని గాలిలో వ్యాప్తి చెందకుండా నిరోధిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాలనే లక్ష్యంతో ఏలూరు కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో ఐ లవ్ ఏలూరు పేరుతో వాటర్ ఫౌంటెన్ నిర్మాణం చేపట్టారు. ఏలూరు తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లోనూ వాటర్ ఫౌంటెన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తాజాగా ఈ పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్ ప్రారంభ దశలోనే ఆగిపోయింది. ఏలూరు జూట్‌మిల్లు సెంటర్‌లో తెలుగుతల్లి విగ్రహాలతో పాటు వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసినా, దాన్ని వినియోగంలోకి తీసుకురావటంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. వాటర్ ఫౌంటెన్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు కోరుతున్నారు.


జూట్‌మిల్లు సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్ ఇలా..


తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లో నిలిచిపోయిన వాటర్ ఫౌంటెన్ పనులు

అశోక్‌నగర్ బ్రిడ్జి సెంటర్‌లో సగంలోనే నిలిచిన వాటర్ ఫౌంటెన్ పనులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ, విద్యా వికాస్ ప్రాంతం, యాదవ నగర్, విద్యా నగర్ కాలనీ, సత్రంపాడు మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మిషన్ శక్తి 100 రోజుల లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్ కిశోర బాలికలకు బాల్య వివాహాలు, వరకట్నం, ఆస్తిలో సమాన హక్కు, ర్యాగింగ్‌లకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఏలూరు సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


వార్షికోత్సవ ఆహ్వాన పత్రం విడుదల చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వాలు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారుల సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా ప్రధాన అధ్యక్షుడు అప్పలభక్తుల శివకేశవరావు విశ్వబ్రాహ్మణులకు సూచించారు. శుక్రవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారుల సంక్షేమ సంఘ 9వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను సంఘ నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి లంకలపల్లి జగదీష్ మాట్లాడుతూ ఆగస్టు 11న సంఘ వార్షికోత్సవం నిర్వహిస్తామన్నారు. మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు, సంఘ ప్రముఖులు కార్పెంటర్స్ సంఘ రాష్ట్ర నాయకులు వేముల దుర్గాప్రసాద్, స్వర్ణకార సంఘ సీనియర్ నాయకులు చిట్టూరి ఉమామహేశ్వరరావులను సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సింహాద్రి భృంగాచార్యులు, కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావు, కార్పెంటర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల దుర్గాప్రసాద్, ఉద్యోగ వ్యాపారుల సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సొమ్ము రూ.12,824 రికవరీ


ప్రజావేదికలో ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న ఏపీడీ పురుషోత్తమ్

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకల నుంచి రూ.12,824లు రికవరీకి ఆదేశించామని డ్వామా ఏపీడీ పురుషోత్తమ్ చెప్పారు. శుక్రవారం ఏలూరు మండల పరిషత్ ఆవరణలో ఏలూరు మండలంలో గతేడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉపాధి పనులపై సేకరించిన సమాచారాన్ని ఏపీడీ ఎదుట వెల్లడించారు. గ్రామ పంచాయతీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీడీ పురుషోత్తమ్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.12,824లు రికవరీ చేయాలని ఆదేశించారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.3000 జరిమానా విధించామని, మరో రూ.40,332ల పనులపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశించామని తెలిపారు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ఉదాసీనత కారణంగా పలు గ్రామాల్లో కూలీలు రూ.2010 వేతనం నష్టపోయారని చెప్పారు. మొత్తంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.15,83,13,974ల ఉపాధి నిధులతో పనులు పూర్తయ్యాయన్నారు. ఇందులో కూలీలకు రూ.11,45,15,795లు వేతనాల రూపంలో అందాయని, మిగిలిన రూ.4,37,98,179లు మెటీరియల్ రూపంలో అభివృద్ధి పనులు నిర్వహించారని చెప్పారు. మొత్తంగా 1,223 పనులు చేపట్టగా, ఇందులో ఈజీఎస్ శాఖ ద్వారా 1,150 పనులు, పంచాయతీరాజ్ ద్వారా 72 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఒక పని ఉందని వివరించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సూర్యచక్రం, డీవీఓ విజయలక్ష్మి, అంబుడ్స్‌మన్, అబ్దుల్‌ఖాన్, ఎంపీడీఓ ప్రణవి, డీఆర్‌డీఓ నాగరాజు, ఏలూరు ఏపీడీ సుధాకర్, మండల ఏపీఓ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీజీఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్)ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. గురువారం ఏలూరు నగరంలో నిర్వహించిన పరిష్కార వేదిక సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది తమ సేవలను సక్రమంగా నిర్వహించకపోయినా, వినియోగారుని సమస్య నిర్ణీత కాల వ్యవధిలో సమస్యలు పరిష్కరించని పరిస్థితిలో బాధితులు న్యాయం కోసం తమను సంప్రదించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, కేబుల్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లో ఓల్టేజ్ సమస్యలు, అదనపు లోడు మంజూరు, విద్యుత్ సర్వీస్ యజమాని పేరు మార్పు, కేటగిరి మార్పిడి వంటి సమస్యలను వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా సీజీఆర్‌ఎఫ్‌కి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలను వేదిక దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు వి.జనార్ధనరావు, రాయసం సురేంద్ర కుమార్, ఏలూరు సర్కిల్ ఈఈ టెక్నికల్ ఎం ఝాన్సీ, ఏలూరు ప్రాంత విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై అవగాహన


గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానెల్‌పై అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు


విమలాదేవి మున్సిపల్ పాఠశాలలో ట్యాబ్‌లో పాఠాలు ఆలకిస్తున్న విద్యార్థులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జాతీయ విద్యావిధానం (ఎన్ఎస్ఈపీ)–2020 నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. సాంకేతికత ఆధారంగా విద్యాభ్యాసం, డిజిటల్ పరికరాల వినియోగంలో అవగాహన, ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాల బోధన, తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్‌ల వినియోగం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే డిజిటల్ విద్యపై అవగాహన కలిగి ఉండడం ద్వారా భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో విద్యార్థులకు మరింత నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: తీవ్ర మానసికవేదనతో ఒక వ్యక్తి పురుగుమందు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ఏలూరు సమీపంలోని శనివారపుపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొల్లపల్లి రమేష్ (35)అనే వ్యక్తికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ నాలుగు నెలల క్రితం వరకు వంగాయగూడెంలోని నివాసం ఉండేవాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలోని ఒకరి వద్ద రూ.లక్షల్లో వడ్డీకి అప్పు తీసుకున్నాడు. వడ్డీ కూడా చెల్లించకపోవడంతో వారు నిలదీశారు. ఈనెల 23న సమస్య పరిష్కారం కోసం పెద్దల సమక్షంలో చర్చించగా, తాను వడ్డీలు కూడా చెల్లించలేనని తనకు చావే మిగిలిందంటూ వారిని బెదిరించి వెళ్లిపోయాడు. పురుగుమందు తాగేసి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతన్ని ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు వన్ టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	10,12
బెండకాయలు	40	కంద	68
పచ్చిమిర్చి	46	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	50
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	50	అల్లం	100–160
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	15–18
క్యారెట్	34–58	పాలకూర	12–15
దొండకాయలు	36	చుక్కకూర	12–15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

నేటి నుంచి దేవతా కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : శ్రీ సనాతన భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో ఆ సంస్థ 389వ కార్యక్రమంగా ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దేవతా కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఏలూరు జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖర రావు తెలిపారు. స్థానిక రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి సేవా కేంద్రంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నేడు సీతారాములకు శాకంబర అలంకారం

ఆషాడ సప్తమి పర్వదినం సందర్భంగా స్థానిక రామకోట్టి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలోని శ్రీ సీతారాముల వారికి శాకంబర అలంకరణ చేయనున్నట్టు శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భక్తుల సహకారంతో సీతమ్మ అమ్మవారికి ఆషాడం సారె సమర్పిస్తామని పేర్కొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ఏలూరు టౌన్: బ్యాంకులో తన పేరుతో క్రెడిట్ కార్డు తీసుకుని రూ.2.50 లక్షలు ఖర్చు చేశాడంటూ బాధితురాలు తన భర్తపై ఏలూరు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు విశాఖపట్టణంలోని కింగ్ జార్జి ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.సువర్ణకు ఏలూరుకు చెందిన మున్నాల సందీప్‌తో 2018 ఫిబ్రవరి 27న వివాహమైంది. కొంతకాలం తరువాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. 2023 డిసెంబరులో వ్యక్తిగత అవసరాలు నిమిత్తం బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు సువర్ణ తన సిబిల్ స్కోరును తనిఖీ చేయించగా ఏలూరులోని ఒక బ్యాంకులో క్రెడిట్ కార్డు ద్వారా రూ.2.50 లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. దీనిపై బ్యాంకు అధికారులతో విచారణ చేయగా ఆమె ఖాతాలో క్రెడిట్‌కార్డు తీసుకున్న భర్త అతని ఫోన్ నెంబర్ ద్వారా లావాదేవీలు నిర్వహించినట్టు తెలిసింది. దీంతో సువర్ణ తన భర్త సందీప్‌పై చీటింగ్ కేసు పెట్టింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఖీమడోలు: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని మహిళా న్యాయవాది టి.రాణి అన్నారు. మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత బేటీ బచావో, బేటీ పడావో అంశంపై 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల బాలికలు, మహిళా టీచర్లకు అవగాహన సదస్సు హెచ్ఎం గారపాటి కనకదుర్గా సునీత అధ్యక్షతన ఏర్పాటుచేశారు. నూతన చట్టాలు, మహిళా, బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది రాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా స్వావలంబన సాధించాలని అన్నారు. హెచ్ఎం కనకదుర్గా సునీత మాట్లాడుతూ చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షహనాజ్ బేగం, ఎం.కవిత, నూర్జహాన్, మహిళా కానిస్టేబుల్స్ టి.అరుణ, వాసవి, ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు బోడ రాజమణి, బాలికలు,మహిళా టీచర్లు పాల్గొన్నారు.


గుండుగొలనులో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రాణి

పోతునూరు హైస్కూల్లో..

దెందులూరు: మిషన్ శక్తి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, 100 రోజుల ప్రత్యేక అవగాహన సమావేశాలు విజయవంతం కావాలని పెదపాడు ఐసీడీఎస్ సీడీపీఓ కె.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పోతునూరు ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, చిట్టెమ్మ, పద్మభూషణం ఆధ్వర్యంలో మహిళా కేంద్రీకృత చట్టాలపై పారా లీగల్ పర్సనల్ లాయర్ ఐ.కృష్ణవేణి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు, మహిళా కేంద్రీకృత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

సీతంపేటలో పాఠశాల విద్యార్థికి డెంగీ నిర్ధారణ

దెందులూరు: దెందులూరు మండలం సీతంపేట పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థినికి డెంగీ నిర్ధారణ అయింది. గ్రామంలో 10 మంది ఇప్పటి వరకు ఏలూరు, దెందులూరు, భీమడోలు సీహెచ్‌సీలు, జనరల్ ఆసుపత్రుల్లో ప్లేట్‌లెట్లు పడిపోయి ఇన్‌పేషెంట్స్‌గా చేరి చికిత్స పొందుతున్నారు. మండలంలో 17 పంచాయతీల్లో 10 రోజులుగా దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు పీహెచ్‌సీ, గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో 200 మందికిపైగా వైరల్ జ్వరాల బారినపడ్డారు.

డెంగీ వాస్తవమే

దెందులూరు మండలం సీతంపేటలో పాఠశాల విద్యార్థినికి డెంగీ జ్వరం రావడం వాస్తవమనేని శుక్రవారం రాత్రి డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శర్మిష్ట ధ్రువీకరించారు. జ్వర బాధితులు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య పరీక్షలు, చికిత్స చేయించుకోవాలని సూచించారు. సీతంపేటలోని గేటు పక్కన ఉన్న దళితపేటలో తక్షణమే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు కోరుతున్నారు.

మువ్వన్నెల జెండా ఎగరాలి


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ఫలితాలు సాధించి దేశానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ అన్నారు. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏలూరులో క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పేందుకు ప్రత్యేక రన్ నిర్వహించామన్నారు. ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఒలింపిక్స్ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతుందన్నారు. భారత క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద ఈ ర్యాలీ నిర్వహించారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులను ఆగస్టు 5 నుంచి 9 వరకూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలన్నారు. గడువు తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించమని చెప్పారు. కనీసం 15 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారు అర్హులన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలి

జంగారెడ్డిగూడెం: దళితులు, ఆదివాసీల ఉపాధికి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేసి అమలు చేయాలని ఇప్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఇప్టూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జంగారెడ్డిగూడెంలో గంపల శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రమణ మాట్లాడు తూ జులై 17 నుంచి ఆగస్టు 6 వరకు దళితుల ఆత్మ రక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. దళిత, ఆదివాసీలను అభివృద్ధి పథంలో తీసుకు రావడానికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను అమలు చేసి వారి ఉపాధి కల్పనకు రుణాలు ఇవ్వాలని తెలిపారు. సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని, మురికివాడల్లోని రోడ్ల అభివృద్ధికి ఈ నిధులను ఉపయోగించాలని కోరారు.